నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

## చిట్టెం వారి వివాహ వేడుకల్లో కేటీఆర్

మక్తల్, ఫిబ్రవరి 23 : మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రెండో కుమారుడు పృథ్వీషారెడ్డి,శ్లోక వివాహం ఆదివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రముఖులు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రెండోరోజూ కొనసాగిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సైనిక దళాల సహాయక చర్యలు
- లోకో ట్రైన్‌లో సహాయక బృందంతో టన్నెల్‌లోకి వెళ్లిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- పర్యవేక్షించిన మంత్రి ఉత్తమ్, కలెక్టర్లు
- రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్

# టన్నెల్‌లో.. టెన్షన్

ఫలించని సహాయక చర్యలు



టన్నెల్‌లో సహాయక చర్యలు చేపడుతున్న ఎడీఆర్ఎఫ్ బృందాలు

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, ఫిబ్రవరి 23: శ్రీశైలం ఎడమగట్టు ఎస్ ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న 8మందిని బయటకు తీసుకురావడానికి రెండురోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆర్మీ , సింగరేణి రెస్క్యూ టీం, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఆదివారం తెల్లవారుజాము వరకు దోమల పెంటకు చేరుకున్నాయి. శనివారం రాత్రి కొన్ని బృందాలు టన్నెల్‌లోకి ప్రవేశించి పరిస్థితిని అంచనా వేశారు. టన్నెల్‌లో మొత్తం బురద పేరుకు పోయి, కాంక్రీట్ పెలాలు, వాటర్‌తో ఇబ్బందికరంగా ఉందని తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, ఆర్మీ రెస్క్యూ టీం, సింగరేణి రిస్క్ టీంతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా లోపలికి వెళ్లారు. లోపలికి వెళ్లే క్రమంలో వారు వెంబడి చేపల వేట కోసం ఉపయోగించే తెప్పలు, వెదురు తడకలు, ట్యూబ్‌లు, కర్రలు, తాళ్లను తీసుకెళ్లారు. రాత్రి 7గంటల సమయంలో వారు బయటికి వచ్చారు. అక్కడికి వెళ్లి వచ్చిన రిస్క్ టీం తెలిపిన ప్రకారం 11కిలో మీటర్ల వరకు లోకో ట్రైన్‌లో వెళ్లి అక్కడి నుంచి బురదలో కర్రలు, తడకలు, తెప్పలు సహాయంతో టీబీఎం మిషన్ వరకు వెళ్లినట్లు తెలిపారు. లోపల మొత్తం మోకాళ్ల లోతు వరకు బురద, చీకటి, కాంక్రీట్ పెలాలు పెరిగి కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా ఉందన్నారు. నీటి ఊట కొనసాగుతూ ఉండటంతో మొత్తం బురదమయంగా మారిందని రెస్క్యూ టీం అతి కష్టం మీద టీబీఎం మిషన్ వరకు వెళ్లినట్లు తెలిపారు. అయితే లోపల చిక్కుకు పోయిన 8మందికి సంబంధించి ఎలాంటి ఆచూకీ, ఆనవాళ్లు కనిపించలేదని పేర్కొన్నారు. టీబీఎం మిషన్‌కు ముందు భాగంలో 50మీటర్ల దూరం వరకు మొత్తం పైనుంచి కూలిపడిన మట్టి, కాంక్రీట్ పెలాలు పేరుకుపోయి మొత్తం బురదమయంగా భయంకరంగా మారిందన్నారు. రెస్క్యూ టీంలు మరింత ముందుకు వెళ్లాలంటే పైనుంచి మరి ఏమైనా కూలిపడే ప్రమాదం ఉందని గ్రహించి అక్కడ నుంచి వెనుదిరిగినట్లు వివరించారు. లోపల చిక్కుకున్న ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు మిషన్ డ్రైవర్లు, నలుగురు కార్మికులు బయటకు తీసుకురావడం చాలా కష్టంతో కూడుకున్నదని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. లోపల చిక్కుకున్న 8మంది ఆచూకీ లభించక పోవడంతో వారి ఆరోగ్య పరిస్థితిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ప్రభుత్వానికి, రెస్క్ బృందాలకు సవాల్‌గా మారింది.

ఎన్నిసార్లు లోపల వెళ్లి వచ్చినా పూర్తి స్థాయిలో పరిష్కారం కనుకొనలేక పోతున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ రెండో రోజూ దోమల పెంటకు చేరుకొని ఎప్పటికప్పుడు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. అయినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం 5గంటల వరకు ఉండి తిరిగి హెలికాప్టర్‌లో వెళ్లి పోయారు. మంత్రి జూపల్లి కృష్ణారావు రాత్రి 9గంటలకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను ముమ్మరం చేసేలా చర్చించారు. అయితే టన్నుల కొద్ది బరువు ఉన్న టీబీఎం మిషన్‌కు సంబంధించి కొన్ని పరికరాలు విరిగిపడ్డాయని తెలిపారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి అధికార యంత్రాంగం, రెస్క్యూ బృందాలు చేపడుతున్న సహాయక చర్యలు పూర్తి స్థాయిలో సఫలం కావడం లేదు. అయితే అధికార యంత్రాంగం సమస్యకు పరిష్కారం కనుగొనే నిపుణుల సహాయం తీసుకొని ముందుకు వెళ్లాల్సి ఉండగా అలాంటి నిపుణులు అయితే కనిపించడం లేదు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకు రావాలంటే కొన్ని రోజులు సహాయక చర్యలు కొనసాగించాల్సి ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. అవసరమైతే టన్నెల్ మిషన్‌ను కట్ చేసి మిషన్ ముందు చిక్కుకుపోయిన వారిని బయటకు తీయడమా? లేక ప్రత్యమ్నాయ మార్గాలను అన్వేషించడంపై చర్చిస్తున్నారు. మొత్తమ్మీద 8మందిని బయటకు తీయడం చాలా కష్టంతో కూడుకున్న పరిస్థితి నెల కొన్నది.



ఇంజినీర్ల సహాయంతో టన్నెల్‌లోకి వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



## ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

కొల్లాపూర్, ఫిబ్రవరి 23: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొల్లాపూర్ పట్టణంలో తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టన్నెల్‌లో పనులు జరిగిన ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని గుర్తు చేశారు. హడావుడిగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా టార్గెట్‌తో ఒత్తిడి పెట్టి పని చేయించడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత వైఖరితో ఉద్యోగాలు, కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టన్నెల్ బోరింగ్ మిషన్ పాడైనట్లు తెలిసినా ఎందుకు పనులు చేయించినట్లు అని ఆయన ప్రశ్నించారు. లూజ్‌గా ఉండే పై కప్పు ప్రాంతాన్ని రాడార్ లాంటి పరిజ్ఞానం వాడి గుర్తించకుండా సీపేజీ క్లియర్ చేయకుండా కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి పనులు చేయించాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ. కోటి పరిహారం ఇవ్వడంతో వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి పూర్తిగా కోలుకునే వరకు వైద్య సాయం అందించి రూ. 50లక్షలు ఆర్థికసాయాన్ని అందించాలన్నారు. టన్నెల్ ప్రమాదంపై స్వతంత్ర కమిటీతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సామగ్రితో టన్నెల్‌లోకి వెళ్తున్న రెస్క్యూ టీం

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

లింగాల, ఫిబ్రవరి 23 : అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాజకీయంగా ఎదుర్కొలేకే ఆస్తుల కూల్చివేతలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేటీ తిరుపతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంతురెడ్డి విమర్శించారు. మండలంలోని అంబట్‌పల్లిలో శనివారం తెల్లవారు జామున సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి నిర్మించుకున్న ప్రహరీని కూల్చివేయడంపై ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేటీ తిరుపతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సింగిల్ విండో మాజీ చైర్మన్ జంబుల వెంకటరెడ్డి పేరుపై 50ఏండ్ల కిందట 732సర్వే నెంబరులో 0.20గుంటల భూమి కొనుగోలు చేసినట్లు అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. ప్రహరీ కూల్చివేస్తున్నట్లు ఎలాంటి నోటిసులు ఇవ్వకుండా స్థానిక నాయకులు ప్రోద్భలంతో ఎమ్మెల్యే, మంత్రుల ఒత్తిడి వల్ల రెవెన్యూ అధికారులు పోలీస్‌శాఖ రాత్రికి రాత్రే వచ్చి కూల్చివేయడం ఎంటని ప్రశ్నించారు. ప్రతిపక్షా హోదాలో ఉంటూ ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడడమే కాకుండా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిస్తున్నారని ఆరోపించారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ ఇలాంటి దాడులకు పాల్పడలేదని ఎన్నికల వరకు మాత్రమే పార్టీలకు పని చేసి ఎన్నికలు ముగిశాక పార్టీలకు అతీతంగా కలిసి మెలిసి మంచి వాతావరణంలో ప్రతి ఒక్కరికీ పథకాలు అందే విధంగా కృషి చేశామని అన్నారు. అధికారం ఎప్పటికి శాశ్వతం కాదని వచ్చే నాలుగేండ్ల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కార్యకర్తలు భయభ్రాంతులకు గురి కాకుండా ఎదురు తిరిగి పోరాడి నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసులు, నర్సింహ, జయంత్ రెడ్డి, హన్మంతునాయక్, మోహన్‌రెడ్డి, పర్వతాలు, బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేటీ తిరుపతయ్య

## నవాబ్‌పేట మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ

- ఒక్కరోజే 11,136 బ్యాగుల పల్లి రాక

నవాబ్‌పేట, ఫిబ్రవరి 23 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం రైతులు భారీగా వేరుశనగ ధాన్యం తీసుకొచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సంత ఉండడం, టెండర్లు సమయానికి అవుతాయనే ఉద్దేశ్యంతో రైతులు పెద్దఎత్తున వేరుశగ ధాన్యాన్ని తీసుకొచ్చారు. ఒక్కరోజే 11,136 బ్యాగుల వేరుశనగ ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్ కుమార్ తెలిపారు. క్వింటాకు గరిష్ఠంగా రూ.6,769, కనిష్ఠంగా రూ.5,020 ధర లభించినట్లు వివరించారు. అలాగే చింతపండుకు క్వింటాకు గరిష్ఠంగా రూ.10,001 ధర పలికినట్లు ఆయన పేర్కొన్నారు. సమయానికి టెండర్లు వేసి కొనుగోలు చేసినట్లు మార్కెట్ కార్యదర్శి తెలిపారు.

## మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

అలంపూర్ చౌరస్తా, ఫిబవరి 23 : ఉండవల్లి మండలంలోని తక్కశిలకు చెందిన జోగు జయమ్మ కుమారుడు అనిల్(18) పదో తరగతి వరకు చదివి కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లిని వేధిస్తున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలంటూ తల్లితో వాదనకు దిగాడు. తన దగ్గర డబ్బులు లేవని, పని చేయకుంటే డబ్బులు ఎలా వస్తాయని తల్లి కుమారుడిని మందలించింది. దీంతో అనిల్ క్షణికావేశంలో ఇంట్లోనే ఇనుప రాడుకు చీరతో ఉరేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ దవాఖానకు తరలించారు.

## కుక్క కాటుకు బాలుడు మృతి

అలంపూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని క్యాతూరులో నాలుగేండ్ల బాలుడు కుక్కకాటు గురై మృతి చెందాడు. బాలుడు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆదివారం పీహెచ్‌సీ వద్ద బాలుడి మృత దేహం ఉంచి కుటుంబ సభ్యులు నిరసన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల, గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన వరలక్ష్మి, సాయికుమార్ దంపతులకు హర్షవర్ధన్ (4), హర్షిత ఇద్దరు సంతానం. జనవరి 22వ తేదీన ఇద్దరు పిల్లలు ఇంటి వద్ద కుక్క కాటుకు గురయ్యారు. గుర్తించిన తల్లిదండ్రులు వారిద్దరిని స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం అలంపూర్ దవాఖానకు రెఫర్ చేశారు. అక్కడ హర్షితకు వైద్యులు చికిత్సలు అందించారు. తల్లిదండ్రులు, వైద్యులు హర్షవర్ధన్ ఒంటిపై ఎలాంటి కుక్కకాటు గుర్తులు గుర్తించలేక పోవడంతో ఎలాంటి చికిత్స చేయలేదు. ఇదిలా ఉండగా హర్షవర్ధన్ ప్రవర్తన,ఆరోగ్య స్థితిలో రోజు రోజుకు మార్పులు గమనించి తల్లిందండ్రులు పెద్ద దవాఖనలో వైద్యం చేయించారు. కాగా కర్నూల్, హైదరాబాద్ దవఖానల్లో చికిత్స చేయించినప్పటికీ వైద్యులు బాలుడిని కాపాడలేక పోయారు. ఆదివారం తెల్లవారు జామున బాలుడు హర్షవర్ధన్ మృతి చెందాడు. సరైన సమయంలో వైద్యం అందించలేక పోయారనే ఆరోపణలలో బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం బాలుడి మృత దేహంతో క్యాతూరు పీహెచ్‌సీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎస్సై వెంకటస్వామి ఘటనా స్థలానికి చేరుకొని సర్ది వారికి చెప్పి శాంతింప చేశారు. అనంతరం బాలుడి మృత దేహాన్ని అలంపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం బాలుడు కుక్కకాటు వల్లే మృతిచెందాడా, లేక మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయాలు స్పష్టమవుతాయని ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హాల్ టికెట్ ఉన్నా.. పరీక్షకు అనుమతి నిరాకరణ

- నిరాశతో వెనుతిరిగిన విద్యార్థి
- అధికారుల తీరుపై విద్యార్థి తండ్రి ఆగ్రహం



లింగాల : ఓఎంఆర్ షీట్ రాకపోవడంతో పరీక్ష రాయకుండా బయటకు వచ్చిన విద్యార్థులు



పరీక్షా కేంద్రం బయట నిల్చున్న విద్యార్థిని భార్గవి

గద్వాల టౌన్, ఫిబ్రవరి 23 : జిల్లా కేంద్రంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థినికి హాల్ టికెట్ ఉన్నా పరీక్ష రాసేందుకు అధికారులు నిరాకరించిన ఘటన చోటు చేసుకున్నది.. బాధితుల కథనం ప్రకారం మానవపాడు మండలానికి చెందిన విద్యార్థిని భార్గవి తన హాల్‌టికెట్‌తో ఆదివారం ఉదయం 10గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకున్నది. కాగా విద్యార్థిని పేరు తమకు వచ్చిన జాబితాలో లేదని పరీక్షా రాసేందుకు అధికారులు అనమతి ఇవ్వలేదు. దీంతో గేట్ బయటే విద్యార్థిని ఉండి పోయింది. అధికారులను బతిమాలాడిన తమ చేతుల్లో ఏమిలేదని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుతిరిగింది. కాగా విద్యార్థినికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రంలో ఆదాయం రూ. 12.50లక్షల ఉంది. ఈ మేరకు విద్యార్థిని పేరు అనర్హుల జాబితాలో వచ్చిందని అందుకే పరీక్షకు అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆదాయం చూపించిన వారికి హాల్ టికెట్ ఎలా జారీ చేశారని విద్యార్థిని తండ్రి వెంకటేశ్ అధికారులు ప్రశ్నించారు. హాల్ టికెట్ జారీ చేయకుంటే పరీక్షా కేంద్రానికి వచ్చే వారమే కాదని, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే తన కూతురికి అన్యాయం జరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రవేశ పరీక్షల్లో ఓఎంఆర్ సీట్ రాక విద్యార్థుల ఇబ్బందులు..

లింగాల, ఫిబ్రవరి 23 : ఐదో తరగతి ప్రవేశ పరీక్షల్లో ఓఎంఆర్ షీట్ రాక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురికాగా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5, 6,7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 990మంది విద్యార్థులకు గానూ 920 పరీక్షకు హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో 10 విద్యార్థులకు ఓఎంఆర్ సీట్ రాకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి తిరిగి పంపేసినట్లు తెలిపారు. 10విద్యార్థులు దరఖాస్తుచేసే సమయంలో కొందరికీ రూ.2లక్షకు పైగా ఆదాయం, మరి కొంతమంది విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలు తప్పుగా నమోదు చేయడంతో వారికి సొసైటీ నుంచి ఓఎంఆర్ సీట్ రాలేదని తెలిపారు. పరీక్ష రాయకుండా విద్యార్థులు బయటకు వచ్చేయడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు చూసుకొని దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.




విద్యార్థినికి జారీ చేసిన హాల్‌టికెట్




